

# 21 దోసిట్లో అవకాశాలు

రెడ్డిగారు అతని వంక వింతగా చూశాడు. "నివ్వా కతలు జెబుతావా? సరేకానీ" అన్నారు.

సుబ్బరాజు సిగ్గుపడ్డాడు. "అబ్బే, నా కత గాదు. అదే ఆయన్జెప్పి పొయ్యాడే అది. ఓ కుర్రోడు ఆకలి కేడస్తా తిరిగి తిరిగి ఓ సత్రం అరుగు మీద స్తంభాన్ని కావలించుకుని నిలబడి ఉన్నాట్ట. ఇంకో కుర్రోడు దారంట పోతా పోతా ఈణ్ణి జూసి ఎందుకన్నాడు. ఆకలేస్తుందన్నాడీడు. ఆడి దగ్గర సంచిలో పేలాలున్నాయి. పట్టెడు దీసిచ్చాడు. కుర్రోడు దోసిలి బట్టాడు. దోసిట్నిండా పేలాలుబోసి ఆడిదార్నాడు బొయ్యాడు. ఈ కుర్రాడు స్తంభాన్ని కావలించుకున్నాడు గదా? అదేమో లావుపాటిది, మోరచాచి నాలికింత సాగదీసినా దోసిట్లో పేలాలు అంది సావలేదు. ఆడికేం పాలుపోలేదు. కసిని పేలగింజలొగ్గేసి, పిడికల్లు ముడిచి చేతు లెనక్కి దీసుకుంటే రెండు గుప్పెళ్ళూ నోటి కందుతాయిగాని ఆడికి మనసొప్పలేదు. ఆకలి మూలాన ఆబగా ఉన్నాడు. ఆటికేసే అలా చూస్తా ఏడుస్తా నిలబడిపొయ్యాడు. గోదార్రోడ్డు సత్రవేమో గాలి జోరుగా ఉంది. గాలికి పేలాలు ఎగిరిపోతున్నాయి. చూస్తా వుండగానే పెద్ద గాలికి ఒక్కసారిగా అన్నీ ఎగిరి దుమ్ముల్లోపడి కొట్టుకు పొయ్యాయి. కుర్రాడు మళ్ళీ ఓ ఏడుపేడిచి ఆ స్తంభాన్నే కావలించుకొని అలాగే నిలబడిపోయాడట..." అని కథ ఆపాడు సుబ్బరాజు.

రెడ్డిగారు పకపక నవ్వారు. ముందుకు వంగి సుబ్బరాజు భుజం తట్టాడు.

"బాబూ, ఈ కత జెప్పింది నువ్వు గాబట్టూరుకున్నాను. చౌదరి మరోడిచేత ఇలాంటిది చెప్పించినా, ఆడే వొచ్చి చెప్పినా ఏంజేసేవాణ్ణో నాకు తెలీదు. నాగ్గావాల్సిన పేలాలు నా గుప్పిట్లో గాదు, జోబీలో గూడా ఉన్నాయన్జెప్పు. చౌదరి కసలు మాట్లాడ్డం చేతగాదు, ఎత్తి పొడుపులూ, ఎత్తు పై ఎత్తులూ ఏంవేస్తాడు?"

★ ★ ★